# వైరాగ్యం

వెంకటేశ్వరరావు కండ్లు సీతవైపే ఒక్క నిమిషంపాటు తీవ్రంగా చూచేయి. ఆ కండ్లలో అసహ్యం గూడు కట్టుకొని వుండడం సీత స్పష్టంగా గ్రహించింది. దిగులుతో, భయంతో ఆమె అట్లాగే భర్తవైపు చూస్తూ నిలబడిపోయింది. వెంకటేశ్వరరావు కండ్లు కేలండరు మీదవున్న మార్చి 17 మీద ఆగి, బాధతో మూసుకున్నాయి. భార్యమీద వున్న చికాకు, అసహ్యత యింకా ఆ ముఖంనుండి అదృశ్యమవలేదు. ఆకస్మికంగా అతను ముఖాన్ని గోడవైపుకు త్రిప్పుకొని పరుండటం గమనించింది సీత.

సీతకు కండ్లనీరు తిరిగింది. తనేమి పాపం చేసింది? తన నెందు కిట్లా బాధిస్తున్నారీమన్యను? నెమ్మదిగా అవతల వార్డులో వున్న నర్సువద్దకు నడిచింది సీత.

'ఏం తల్లీ యిట్లా వచ్చేవు? మీ ఆయనకు ప్రమాదం తప్పిపోయిందిగా......మరేం ఫర్వాలేదింక!'

'నా కేమో భయంగా వుంది సిస్టర్! నావైపు ఎట్లాగో అదోలాగ......యిదివరకెన్నడూ చూడనట్లు చూస్తున్నారు ఆయన.'

'ఎట్లాగ......కోపంగానా?' అడిగింది సిస్టర్ 'ఛార్టు' చూస్తూ.

'మీరు...వేరే అర్థం చేసుకోకండి...నన్ను వారు అసహ్యించుకుంటున్నారు సిస్టర్.' నెమ్మదిగా చెప్పింది సీత.

'ఛ! నువ్వు పొరబడుతున్నావమ్మా! మీ ఆయన ఎప్పుడూ నిన్ను గురించే మాట్లాడుతూంటారే!...ఆప్యాయంగా!...'

'అవును. నే నిక్కడ లేనప్పటి సంగతది. నన్ను చూడగానే వారి కండ్లు అసహ్యతతో నిండిపోతాయి. నువ్వింకా ఆరోగ్యంగా వున్నావా అన్నట్లు నన్ను ఎగాదిగా చూస్తారు. నువ్వు మాత్రం ఎందుకు జబ్బు పడకూడదూ అన్నట్లు మాటీ పోటీ మాట లంటూంటారు. నేనేదైనా మాట్లాడితే చాలు, 'అవును......నేను పోయేక నువ్వు హాయిగా వుండొచ్చు' అన్నట్లు ఎత్తిపొడుస్తారు. నన్నసలు హాస్పటలు దరిదాపులకుకూడా రావద్దన్నట్లు మాట్లాడుతున్నారు...నే నేం చేయను సిస్టర్.'

నర్సు నవ్వుతూ కూర్చుండిపోయింది. ఒక్క క్షణంతర్వాత ఆమె అన్నది 'మరేమీ ఫర్వాలేదమ్మా...ఎప్పుడూ జబ్బు పడని కొందరు వ్యక్తులు జబ్బొస్తే యిట్లాగే ఈర్ష్యతో వింతగా ప్రవర్తిస్తారు. జ్వరపు లక్షణాలు పోగానే, యీ లక్షణాలుకూడా క్రమంగా అదృశ్యమయి పోతాయి. నువ్వేమీ ఖంగారు పడ నవసరంలేదు...కాస్త ధైర్యంగా మాత్రం వుండు.'

సీత కండ్లు తుడుచుకొని బయటికొచ్చే సరికి హాస్పటలులో 'విజిటర్ల'ను వెళ్ళిపొమ్మని గంట కొడుతున్నారు.

*　　*　　*

వెంకటేశ్వరరావు చీకు చింతా లేని జీవితం గడుపుతూండేవాడు. భార్యా, అతనూ...వేరే పిల్లా పీచూ లేరాతనికి. నెలకి రెండు వందలు తెచ్చుకుంటూ నిర్విచారంగా వుండేవాడతను. మార్చి 10 వ తేదీ వుదయాన అతను వున్నట్లుండి, ప్రక్కమీదనుంచి లేవలేకపోయేడు. భయపడి భార్యను కేకవేసేడు. భార్యవచ్చి చూచింది. కుడి చెయ్యి, కుడి కాలు వాచి వున్నాయి. వాటిని కదపలేకుండా వున్నాడతను. భయపడిపోయి డాక్టరును పిల్పించిందామె. డాక్టరువచ్చి 'ర్యూమెటిజెం' అనిచెప్పి, హాస్పిటలులో చేరడం మంచిదని సలహాయిచ్చేడు. తన కుడికాలు, కుడిచెయ్యి వాచి వుండటం గమనించిన వెంకటేశ్వర్రావుకి తన కెందుకు యీ రోగం రావాలో అర్థంకాలేదు. ఈ ప్రపంచం చాలా క్రూరమైంది అనుకున్నాడతను. డాక్టరు ఎంత ధైర్యం చెప్పినా దిగులుపడిపోసాగేడు. తన కెందుకు రావాలి యీ రోగం అన్న ఆలోచన తప్పితే మరో ఆలోచనే లేదు.

*　　*　　*

కాంతి! ఇదివరకెన్నడూ తను ఎరుగనటువంటి కాంతి! మృదువుగా, నురగవలె 'హాలోజన్' నుండి నేలకుజారిపోయే కాంతి!

సన్నగా, ఎక్కడి నుండో మూలుగు! ఏమిటా మూలుగు? ఎక్కడున్నాడు తను?

బాధతో కండ్లు మూసుకున్నాయి. గుండెల్లో ఏదో చిక్కని మంట ఆరంభమయ్యింది. ఎందుకు తనిట్లా బాధపడటం? చక్కగా తను మందేదైనా తీసుకుంటే బాగుండును.

మెత్తని బూట్ల శబ్దము వినవచ్చింది. చాలా దగ్గరగా, మృదువుగా ఎవరో అంటూన్నారు ఎవరితోనో 'ఫర్వాలేదమ్మా! అట్లా కండ్లనీరుపెట్టుకుంటే ఎట్లా? గండం గడచిపోయినట్లే! చూడు, టెంపరేచరుకూడా 'నార్మలు'కు వచ్చేసింది.'

నెమ్మదిగా కండ్లు తెరిచేడు వెంకటేశ్వరరావు, ఎదురుగా లక్ష్మణరావు అవుపించసాగేడు! తన యింట్లో ఎందుకున్నాడు యితను? మంచంమీద పడుకొనివున్నాడు. జబ్బు పడినట్లు అట్లా చిక్కిపోయి వున్నాడేం?

వెంటనే వెంకటేశ్వరరావుకు గుర్తుకొచ్చింది, తను హాస్పటలులో వున్నట్లు. ఛార్టుగోడకి తగిలించి వచ్చిన నర్సు లక్ష్మణరావు 'టెంపరేచరు' తీసుకుంటూండటం గమనించేడతను. ఇంకెందుకు అనుమానం – తను యింకా హాస్పటలులోనే వున్నాడు!

డాక్టరు రంగనాథంవచ్చి 'ఎట్లా వుంది సిస్టర్! టెంపరేచరు నార్మలేనా?' అని అడుగుతున్నాడు.

'ఓ నార్మలే' దుప్పటి సరిగా లక్ష్మణరావుకి కప్పి నర్సు మరో పేషెంటువద్దకు నడిచింది. డాక్టరు మరోదిక్కుకి వెళ్ళిపోయేడు తన వంకైనా చూడకుండానే.

తనంటే డాక్టరు కూడా ఆశలు వదులుకున్నట్టున్నాడు. ఇదివరకు ఎప్పుడూ తనవద్దనే వుండేవాడు...యిప్పుడు రోజు కొకసారైనా తనని చూడడేం?

ఎదురుగుండా లక్ష్మణరావు దగ్గుతో వుక్కిరి బిక్కిరి అవుతూ 'స్పిట్టూన్' అందక వసుగుతున్నాడు.

వంటరిగా, బాధతో వెంకటేశ్వర్రావు మనస్సంతా వికలమయిపోయింది. వక నిట్టూర్పువిడిచి నుదుటిమీద చెయ్యివేసుకొని చూచుకున్నాడతను. శరీరమంతా వెచ్చగా వున్నట్లనిపించింది ఆతనికి.

లక్ష్మణరావు భార్య ఎంతో ఆదుర్దాతో 'స్పిట్టూన్' అందుకొని భర్త నోటివద్ద ఎత్తిపట్టుకున్నది. అతను అందులో కళ్ళెవుమిస్తా, వక్క క్షణం ఆయాసంతో కండ్లు మూసుకొని, ఉన్నట్లుండి భార్య నెత్తిమీద వకటి తగిలించి 'వుక్కిరి బిక్కిరి అయి చస్తూంటే చూస్తూ వూరుకుంటావేమే...' అన్నాడు.

పాపం, ఆమె కిమ్మనలేదు. ఎంతో వోర్పుతో కన్నీళ్ళు ఆపుకుంటూ, ముందుకు వంగి 'స్పిట్టూన్'ని నేలపైన వుంచి, 'సోడానీళ్ళిమ్మంటారా?' అని అడిగింది.

లక్ష్మణరావు వగరుస్తూనే, వో తిట్టు

పెట్టి, 'అక్కరలేదా'ని తలగడకి చేరబడి కూర్చున్నాడు

వెంకటేశ్వరరావు బాధగా కళ్ళు మూసుకున్నాడు మళ్ళీ. కుమిలిపోయే ఆ యిల్లాలి ముఖం చూడలేకపోతున్నాడతను.

'బ్రూట్' అని లక్ష్మణరావును నిందించుకున్నాడు, మూసుకున్న కండ్లతోనే వెంకటేశ్వరరావు నిన్న యీ లక్ష్మణరావు హాస్పిటలులో చేరింది లగాయితు చూస్తున్నాడు అతని వైఖరి. ఇంట్లో పనులన్నీ చక్కబెట్టుకొని, యిక్కడ మళ్ళీ భర్తకు సపర్యలు తక్కువ అవుతాయేమోనని వచ్చిన భార్యను పశువులా హింసిస్తాడేమిటి యితను?

వెంకటేశ్వరరావుకు వక్కక్షణంపాటు ఆలోచనలు ఆగిపోయేయి. మూసుకున్న అతని కండ్లకి అంబోతు వకటి అవుపించసాగింది. లక్ష్మణరావే కాబోల్ను అది! 'పశువు బ్రూట్.' అకస్మికంగా ఆ అంబోతు ముఖం సినిమాలోని '*Close up*' వలె స్పష్టంగా, పెద్దదిగా, దగ్గరగా అవుపించసాగింది. లక్ష్మణరావు పోలికలు లేవు దానికి. దాని ముఖానికి కుడివైపున, తనకున్నట్లే చిన్న చార అడ్డంగావుంది.

భయంతో కండ్లు తెరిచేడు వెంకటేశ్వరరావు. ఎదురుగా లక్ష్మణరావు గ్లాసుతో కాఫీ త్రాగుతున్నాడు. అతని భార్య ప్రక్కనే నిలబడి చల్లగా, విసనకర్రతో నెమ్మదిగా విసురుతున్నది.

'మగవాడికి వున్నంత క్రోధం, ఆడదానికి కూడా వుంటే యిద్దరి బ్రతుకులు ఏమయిపోయేవో? భూదేవికూడా లేని సహనం వీళ్ళకు ఎట్లావుంటుందో!'

వెంకటేశ్వరరావుకు గొంతు ఎండిపోతున్నట్లు అన్పించసాగింది. 'కొంచెం మంచినీళ్ళు ఎవరన్నా యిస్తే బాగుండును! ఈ నర్సు ఏమయిపోయింది? తన భార్య ఏమయిపోయింది యింతవరకు రాకుండా? తను యిట్లాగే గొంతు ఎండిచని పోతాను కాబోల్ను. ఎవర్నీ పిలవడానికి తన గొంతుకి కూడా లేవదేం? తనకి ఆరోగ్యం చక్కపడుతూంది అంటాడే డాక్టరు. తనసలు ప్రక్కలో ఆ వైపు నుంచి యీ వైపుకు తిరగగలడా?' ప్రయత్నించి నెమ్మదిగా యిటువైపు తిరిగేడతను. సీత ఎదురుగా గుమ్మములో కూర్చుని ఏదో బొమ్మల పుస్తకం చూస్తూండటం గమనించేడతను.

అంత నీరసంలోనూ వెంకటేశ్వరరావుకు విపరీతమైన కోపంవచ్చింది. తనిక్కడ చావడానికి సిద్ధంగావుంటే చీకూ చింతా లేనట్లు అదేదో బొమ్మల పుస్తకం చూచుకుంటూన్నది. తనెప్పుడు పోతాడా, పీడ



ఉన్నట్లుండి భార్య నెత్తిమీద వకటి తగిలించి 'వుక్కిరి బిక్కిరి అయి చస్తూంటే చూస్తూ వూరుకుంటావేమే' అన్నాడు.

విరగడయిపోతుంది అన్నట్లు అట్లా కూర్చుంటుందేం? ఈ సమయంలో అమ్మ కనక యిక్కడ వుంటే ఎంత బాగుండును. తన కోసం ప్రతిక్షణమూ గిలగిల లాడిపోదూ? ఇంకో రెండు మూడు దినాలు చూచి అమ్మకి వుత్తరం రాయించాలి!

సీత వెంకటేశ్వరరావును చూచి ఏం కావాలి అన్నట్లు లేచి నిలబడింది అదుర్దాగా. వెంకటేశ్వరరావు చింతగా 'ఏదో' సంజ్ఞచేస్తూ కండ్లు మూసుకున్నాడు. అతని ముఖం అసహ్యంతో నిండిపోయింది.

సీతకు ఆలోచించే అవకాశం లేదు. సంజ్ఞను ఎట్లాగో గ్రహించి వెంటనే గ్లూకోజు డబ్బా అందుకొని, నీళ్ళలో కలిపి మంచందగ్గర నిలబడింది చెంచాతో.

వెంకటేశ్వరరావు కండ్లు తెరచేసరికి సీత

# వెలుగు

గ్లాకోజు నీళ్ళతో దగ్గరగా నిలబడివుంది బెదురుతూ మళ్ళీ సంజ్ఞచేసేసరికి నెమ్మదిగా చంచాతో గ్లూకోజ్ అతని నోట్లోకి అందించ సాగింది సీత.

అతనికి విపరీతంగా చెమట పడుతూండటం గమనించి, సీత, టవలుతో అతని ముఖాన్ని తుడిచి, మళ్ళీ గ్లూకోజ్ యివ్వసాగింది.

చేతిని నోటికడ్డుపెట్టుకొని యిక చాలన్నట్లు ఆపేడతను. సీత గ్లూకోజ్ గ్లాసును నిశ్శబ్దంగా చిన్న బల్లమీద వుంచి, మరో సారి 'టవలు'తో అతని ముఖం తుడిచి, చిరునవ్వుతో, విసరసాగింది.

తలిక చావను, చెమట బాగా పట్టింది. జ్వరం పూర్తిగా వదిలిపోయి వుండాలి. పూర్వంలాగా తన తలలో 'దిమ్ము' కూడా లేదిప్పుడు.

సీత ముఖంవైపే చూస్తూ పడుకున్నాడతను. కండ్లు రెండూ ఎర్రగావున్నాయి. సీతకి నిద్రలేదా, లేక ఏడుస్తుందా?

కండ్లు రెండూ మూసుకున్నాడతను. తేనెటీగలు తుట్టెలోనుండి కదలినట్లు కిరులుతున్నాయి ఎవ్వేవో ఆలోచనలు. తన శక్తి సగము యీ అర్థములేని ఆలోచనలతోనూ, అణచబడిన కోరికలతోను నశించిపోతూన్నది. అవును, తన యీ రోగానికి కూడా కారణం కొంతవరకూ నిరాశే.

కండ్లు తెరిస్తే విచారంగా తనవంక చూస్తూన్న సీత! కండ్లు మూస్తే తనలాగే వున్న ఆంబోతు. తను కాదుకదా యీ ఆంబోతు? ఛీ! ఛీ!

ఆ ఆలోచనను వక్క విదిలింపు విదిల్చి, వేరే యేదైనా ఆలోచించబోయేడు అతను. సీత కిటికీవద్ద నిలబడి ఏడుస్తూన్నట్లు అన్పించింది. ఎందుకేడుస్తూంది? తను ఆమెపైన చిరాకు పడుతున్నందుకేనా?

ఎవరో నిలవేసి ప్రశ్నించినట్లనిపించింది వెంకటేశ్వరరావుకి. 'ఎవరు పశువు? నువ్వా నేనా? పాపం, అంతదూరంనుంచి ఎండనబడి వచ్చిన భార్యని నానామాటలూ అనీ, లేనిపోని అనుమానాలతో బాధపడే నువ్వా, లేక నేనా పశువు?'

చీకట్లో ఆ ముఖం స్పష్టంగా అగుపించలేదు. దగ్గరలో కూడా ఏమీ అవుపించడం లేదు, ఆ ముఖాన్ని యీడ్చి కొడదామనుకుంటే.

ఎక్కడినుంచో ఎవరో వెక్కి వెక్కి ఏడవటం వినవచ్చింది చటుక్కున కండ్లు తెరిచేడతను. ఎదురుగా సీత శాంతంగా విసురుతూనే వుంది. అవతల గదిలో కాబోల్ను ఎవరో రోగి బాధతో యేడుస్తున్నట్లున్నాడు.

ఎందుకొస్తాయో యీ రోగాలూ, బాధలూ! ఆలోచనలలాగే యివీ తప్పనిసరి కాబోలు ప్రతి జీవికీ!

సీత కండ్లు తుడుచుకుంటూంది, వక్క క్షణం విసరడం ఆపి, చెమటను తుడుచుకుంటూన్నట్లుంది - ఏడవడానికేముందని, యిందులో.

ఇక తన జబ్బు తగ్గిపోయినట్లే! తను వద్దన్నాగాని, పాపం కంటికి రెప్పలాగ ఎట్లా తనను కనిపెట్టుకుని కూర్చుంటూన్నదో! డి. యం. ఓ. గారివద్ద తన జబ్బు నయమవ్వక యేమవుతుందీ? ఇంకో గంట ఆగి అది యింటికి వెళ్ళిపోవచ్చు.

చాలా స్వల్ప విషయాలలో యిదివరకు ఏమీ పట్టనట్లు భార్యయెడ తను యెట్లా ప్రవర్తించినదీ గుర్తుకు రాసాగినది వెంకటేశ్వరరావుకు. ఒకసారి దానికి జ్వరం వస్తే, అదే తగ్గిపోతుందిలే అని వైద్యుడిని కూడా పిలువకుండా వూరుకున్నాడు. ఆడవాళ్ళకి అసలు జబ్బులేమిటి అన్నట్లు నీచంగా ప్రవర్తించేడు తను. తర్వాత పాపం, అట్లాగే లేచి వంటపనీ అదిచేసేది.

అవును. ఆ ఆంబోతు తనే. లక్ష్మణరావు కంటె కూడా హీనంగా, నీచంగా ప్రవర్తించేను తను యీ రోగంలో! సీతను గురించి ఎన్నెన్ని అనుకున్నాడు తను! ఎంత అసహ్యించుకున్నాడు! ఈ ఆడవాళ్ళకు ఓర్పే లేకపోతే తనవంటి భర్తల గతి ఏమయివుండేదో!

కండ్లు తెరిచేడు వెంకటేశ్వరరావు. సీత తనవంకే చూస్తూ యింకా అట్లాగే విసురుతూ వుంది. తనని చూస్తూ భయంతో 'ఫ్లాస్కులో కాఫీ వుంది యిమ్మంటారా?' అడిగింది.

ఒకడు: నిజానికి అబద్ధానికి ఎంతదూరం రా?

మరియొకడు: బెత్తెడు.

మొదటివాడు: ఎల్లాగో చెప్పు

రెండవవాడు: కళ్ళారా చూసినది నిజం - చెవులతో విన్నది అబద్ధం.

- శ్రీ క. వి. గఱ్ఱం, (భీమవరం.)

మలినంగా, హీనంగా వచ్చిన చిరునవ్వుతో 'నే' అన్నాడు వెంకటేశ్వరరావు, 'ఇవ్వు'

పడుకొనివున్న భర్త గొంతులో కొంచెం చొప్పున కాఫీ పోసి, 'ఎట్లావుంది?' అని అడిగింది సీత బెరుకుగానే.

'ఫర్వాలేదు' అన్నట్లు తలవూపి, అలసటతో కండ్లు మూసుకొని 'విసరు' అన్నట్లు సంజ్ఞచేసేడు వెంకటేశ్వరరావు. లోపలనుండి పొగలు! చల్లటి గాలితో ప్రాణం లేచివచ్చినట్లయి, మళ్ళీ కండ్లు తెరచి సీతనుచూస్తూ 'కూర్చో' అన్నాడతను మంచం చూపుతూ.

సీత ముఖం సంతోషంతో వికసించింది. నెమ్మదిగా భర్త కాళ్ళదిక్కున కూర్చుని మళ్ళీ విసరసాగింది. అతని హృదయం ఏదో ఆనందంతో నిండినట్లయింది - వక ఆలోచనతో. నెమ్మదిగా ఆమె చేతిని తన చేతిలోనికితీసుకుని 'కాఫీతాగేవా' అడిగేడతను.

సీత తల తిప్పుతూ, నెమ్మదిగా చేతి వదిలించుకొని 'నా కాఫీకేమి తొందర వచ్చింది? తాగుతాలెండి.' అన్నది మృదువుగా.

ఉండుండి లక్ష్మణరావు అవతల ప్రక్కమీదనుండి అరువసాగేడు 'అవును. నేను చస్తాను...అదేగా నీ కోరిక! హాయిగా నువ్వా డాక్టరుతో సరసాలాడుకోవచ్చును. ...నేనిక్కడ నీరసంతో చచ్చిపోతూ వుంటే నువ్వక్కడ నిద్రపోతావేమే... కావలిస్తే విషం పెట్టు...త్వరగా వదుల్తుంది నీకు పీడ.'

వెంకటేశ్వరరావుకు నవ్వొచ్చింది. తిన్నగా సీత కండ్లలోకి చూసేడతను.

కేశముల సౌందర్యాభివృద్ధికి
కాష్మీర్-కుసుమ్
ఇష్టమైన నూనెలో నానబెట్టుడు
సుగంధ చర్మరక్షణ మలామ్
సొంటలక్స్
దురద, గడ్డలు, కాట్లు, మొటిమలకు
ప్రేమలీల
ప్రసిద్ధమైన మైసూర్ ఊదువత్తులు.
యునైటెడ్ కన్సర్న్స్ - మద్రాస్-1.
బ్రాంచి: విజయవాడ.

రాజా - పేదా
వెల: 2-0-0
తపాలాఖర్చు ప్రత్యేకము.
ఆంధ్రగ్రంథమాల, మదరాసు. 1.

వెంకటేశ్వరరావు కండ్లు ఆనందంతో మెరుస్తూండటం చూచింది సీత. ఆ కండ్లలో కాంతితోనిండిన దివ్యహార్మ్యం చూచింది సీత.

సీత కండ్లలో యేమి చూచేడో వెంకటేశ్వరరావు, అతనుమాత్రం ఆమె చేతిని చిన్న నొక్కునొక్కి వదిలివేసేడు చిరునవ్వుతో.

ప్రశాంతంగా తిరిగి కండ్లు మూసుకున్న అతనికి, ఆకాశంనుంచి నేలకు, మృదువుగా నురగవలె జారిపోయే వింత కాంతి అవుపించ సాగింది. ★

